## 638

ప॥ ఎందుకో నన్నింతగా నీవు - ప్రేమించితివో దేవా
అందుకో నా దీన స్తుతిపాత్ర - హల్లెలూయ యేసయ్యా

1. నా పాపము బాప - నరరూపివైనావు
నా శాపము మాప- నలిగి వ్రేలాడితివి
నాకు చాలిన దేవుడవు నీవే - నా స్థానములో నీవే ॥హల్లె॥

2. నీ రూపము నాలో - నిర్మించియున్నావు
నీ పోలికలోనే - నివసించుచున్నావు
నీవు నన్ను ఎన్నుకొంటివి - నీ కొరకై నీ కృపలో ॥హల్లె॥

3. నా శ్రమలు సహించి - నా ఆశ్రయమైనావు
నా వ్యధలు భరించి - నన్నాదుకొన్నాము
నన్ను నీలో చూచుకున్నావు - నను దాచియున్నావు ॥హల్లె॥

4. నీ సన్నిధి నాలో - నా సర్వము నీలో
నీసంపద నాలో - నా సర్వస్వము నీలో
నీవు నేను ఏకమగువరకు - నన్ను విడువనంటివే ॥హల్లె॥

5. నా మనువులు ముందే - నీ మనస్సులో నెరవేరే
నా మనుగడ ముందే - నీ గ్రంథంబులో నుండె
ఏమి అద్భుత ప్రేమ సంకల్పం - నేనేమి చెల్లింతున్ ॥హల్లె॥

## 639

1. ఓ మానవుండ నీ గతి యేమౌనో తెలియునా
యేమేమి చేయుచుంటివో తప్పించుకొందువా?.... ॥ఆహా॥

ప॥ ఆహా..ఆ...అంత్యతీర్పు నందున ...యేసూ నీ రక్షకుడే
మహాభయంకరమో ...సింహంబుగా నుండు

2. లోకాలు పుట్టినప్పటినుండి మృతులైన
ఏ కులజుడైన నాటికి - తీర్పులో నిలచును ॥ఆహా॥

3. మృతులైన ఘనులు హీనులు - యేసయ్య యెదుటను
ప్రతివారు నిలిచియుందురు బ్రతికిన రీతిగనే ॥ఆహా॥



4. గ్రంథాలు విప్పబడగ - గ్రంథాలలో వారి
గ్రంథంబు బట్టబయలై - పొందుదురు తీర్పును ॥ఆహా॥

5. నరులెల్ల క్రియలచొప్పున - మరి తీర్పు పొందుదురు
మరణము మృతుల లోకము - గురియౌను యగ్నికి ॥ఆహా॥

6. ఈనాడు నీవు కూడను - యేసుని విడిచినచో
ఆనాడు నీవు కూడాను - అందుండి ఏడ్చెదవు ॥ఆహా॥

7. దేవుని జీవగ్రంథము - దేవుడు తెరచును
ఎవ్వాని పేరందుండదో - వాడగ్నిలో బడును ॥ఆహా॥

## 640

ప॥ ఓ యేసు నీ ప్రేమ ఎంతో మహనీయము
ఆకాశతార పర్వత సముద్రముల కన్న గొప్పది

1. ఆగమ్య ఆనందమే - హృదయము నిండెను
ప్రభుని కార్యములు గంభీరమైనవి ప్రతి
ఉదయ సాయంత్రములు స్తుతికి యోగ్యములు ॥ఓ యేసు॥

2. సంకట సమయములో - సాగలేకున్నాను - దయచూపు
నామీద అని నేను మొరపెట్టగా - వింటినంటివి
నా మొర్రకుముందె - తోడనుందునంటివీ (2) ॥ఓ యేసు॥

3. మరణాంధకారపు - లోయనే సంచరించన
నిరంతరమేసు - నాదు కాపరియై - కరములిచ్చి
నన్ను గాయుచు నడుపు - కరుణగల ప్రభువు (2) ॥ఓ యేసు॥

4. కొదువలెన్ని యున్న - భయపడ నే నిపుడు - పచ్చిక -
బయలులో పరుండజేయును - భోజన జలములతో
తృప్తిపరచును - నాతో నుందు నేను (2) ॥ఓ యేసు॥

5. దేవుని గృహములో - సదా స్తుతించెదను - సంపూర్ణ
హృదయముతో సదా భజించెదను - స్తుతి ప్రశంసలకు
యోగ్యుడేసు - హల్లెలూ ఆమెన్ (2) ॥ఓ యేసు॥